క్లుప్తంగా

బోరుమోటార్ల ఏర్పాటుకు చేయూత



బోరుమోటార్‌ను ప్రారంభిస్తున్న హరినాథ్‌రెడ్డి

కొత్తూరు: మండల పరిధిలోని తీగాపూర్ గ్రామంలో బోరు మోటార్ల ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే సుమారు రెండు లక్షలు ఆర్థికసాయం చేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో నీటి సరఫరా చేసే బోర్లు తరచూ పాడైపోతుండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సాయం చేసినట్లు వివరించారు. దీంతో పలుచోట్ల బుధవారం కొత్త మోటార్లను బిగించి నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

27న ఆలయ భూముల వేలం

కొందుర్గు: కొందుర్గు లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి సంబంధించిన వ్యవసాయ భూములను మూడేళ్లపాటు కౌలుకు తీసుకొని సాగుచేసుకోవడం కోసం ఈ నెల 27న వేలం వేయనున్నట్లు దేవాలయ కార్యనిర్వాహక అధికారి శ్రీనివాసశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొందుర్గు పరిసర ప్రాంతంలో ఉన్న భూములను గత నెల 26న వేలం వేశామని, ప్రస్తుతం గంగన్నగూడ గ్రామ సమీపంలోని భూములను వేలం వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు రూ.2వేలు దరావత్ చెల్లించి 27న ఉదయం 11 గంటలకు నిర్వహించే వేలం పాటలో పాల్గొనాలని ఆయన సూచించారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు



విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేసిన హెచ్‌ఎం కవిత, తదితరులు

షాబాద్: చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని నాగర్‌గూడ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కవిత, గ్రామ సంఘం అధ్యక్షురాలు రావుల లక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగర్‌గూడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని సూచించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

దేశంలో కాంగ్రెస్ గాలి వీస్తోంది

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మధుసూదన్‌రెడ్డి, తదితరులు

షాబాద్: బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పికొట్టేందుకు సిద్ధమయ్యారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కొమరబండ, బొబ్బిల్లిగామ, ఊబగుంట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావడం కాయమని, దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తుందన్నారు. ఎవరూ ఎన్ని కుట్రలు చేసినా కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలన్నింటినీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాశనం చేసిందని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ ఊసేలేదని, బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు దూరమయ్యారన్నారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ఎంపీటీసీలు జయమ్మవెంకట్‌రెడ్డి, చెన్నమయ్య, మల్లేశ్, అశోక్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నయ్య, నర్సింహులు, సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరు మల్లేశ్, మాజీ సర్పంచ్‌లు జనార్దన్‌రెడ్డి, బుచ్చయ్య, సత్యం, రవీందర్, రవీందర్‌నాయక్, మహేందర్‌గౌడ్, నాయకులు వెంకటయ్య, జాకీర్‌షరీఫ్, రాహుల్‌గుప్తా, అక్తర్ పాషా, చంద్రయ్య, చేవెళ్ల స్వామి, కుద్దూస్, శ్రీరాంరెడ్డి, సుభాష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఇంటర్ విద్యార్థుల ప్రభంజనం



చికిత(ఎంపీసీ (964/1000) | స్వాతి(బైపీసీ) (976/1000) | శ్రావణి(ఎంపీసీ) (444/470) | జి.అనిల్, సీఈసీ (949/1000) | ప్రసన్న, సీఈసీ (925/1000)

చేవెళ్ల: మండలంలోని ఆదర్శ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో టీడీ చికిత 964, డి.కావేరి 956, బైపీసీలో ఎస్.స్వాతి 976, పి.పూజ 970, సీఈసీలో జి.శ్రావణి 939, ఎస్.శిరీష 921, ఎంఈసీలో బి.స్పందన 923, బి.లయ 865 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీలో సర్భాజిత్ 457, ఎం.శ్రావణి 444, బైపీసీలో కె.ఉషశ్రీ 429, సదియాబేగం 426, సీఈసీలో నహేదబేగం 474, కె.అక్షిత 473, ఎంఈసీలో శృతి 456 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. ప్రిన్సిపాల్ అభినందించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 64శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో 50శాతం ఉత్తీర్ణత సాధించారు.



స్ఫూర్తి, బైపీసీ (331/440) | తేజ, ఎంపీసీ (441/470) | శిరీష, బైపీసీ (669/1000) | ప్రియాంక, ఎంపీసీ (968/1000)

చేవెళ్ల గురుకులంలో బాలికల విజయకేతనం

మొయినాబాద్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. బుధవారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీలో 95 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. అదే విధంగా మొదటి సంవత్సరం 75 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం స్ఫూర్తి బైపీసీ(331/440), ఎంపీసీలో తేజ(441/470), ద్వితీయ సంవత్సరం బైపీసీలో కె.శిరీష(669/1000), ఎంపీసీలో ప్రియాంక(968/1000), చేవెళ్ల గురుకుల కళాశాలలో విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో ఉన్నత విద్యకు వెళ్లాలని ఆమె సూచించారు. మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులను ఆమె అభినందించారు.

కొందుర్గు విద్యార్థుల ప్రతిభ



శ్రీవాణి,ఎంపీహెచ్‌డబ్ల్యూ (477/500) | అలినానాయక్, సీఈసీ (431/500) | అంజలి, ఎంపీహెచ్‌డబ్ల్యూ (960/1000) | ప్రశాంత్, ఎంఈసీ (470/500)



వింధ్య,ఎంపీహెచ్‌డబ్ల్యూ (983/1000) | విష్ణు, బైపీసీ (375/440) | మహేశ్‌కుమార్, ఎంపీసీ(859/1000) | జస్వంత్, బైపీసీ (795/1000)

కొందుర్గు: ప్రథమ సంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యూలో కొందుర్గు కేజీబీవీ విద్యార్థి దివ్య, శ్రీవాణి, బి.శ్రీవాణి 500 మార్కులకు గాను 477 మార్కులు సాధించినట్లు పాఠశాల ప్రత్యేకాధికారిణి శేఖినా నిస్సీ తెలిపారు. అదే విధంగా సీఈసీలో అలీనానాయక్ 500లకు గాను 431 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీహెచ్‌డబ్ల్యూ వింధ్య 1000కి గాను 983 సాధించి టాపర్‌గా నిలిచింది. అంజలి 960 మార్కులు సాధించారు. అదేవిధంగా సీఈసీలో రాధిక 819 సాధించినట్లు పేర్కొన్నారు.

బాలుర గురుకులంలో..

కొందుర్గు సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఎంఈసీ ప్రథమ సంవత్సరంలో 500 మార్కులకు గాను ప్రశాంత్ 470 మార్కు లు సాధించినట్లు ప్రిన్సిపాల్ థామస్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా బైపీసీలో 440 మార్కులకుగాను విష్ణు 375 సాధించారు. ద్వితీయ ఎంపీసీలో 1000 మార్కులకుగాను మహేశ్‌కుమార్ 859 సాధించగా బైపీసీలో జస్వంత్ 795 సాధించినట్లు ఆయన పేర్కొన్నారు.

సత్తాచాటిన గురుకులాల విద్యార్థులు



ఎం.దీన్‌దయాల్, ఎంపీసీ (983/1000) | కె.మహేశ్, ఎంపీసీ (981/1000) | కె.నవీన్ , ఎంపీసీ (980/1000) | సీహెచ్ శ్రీవర్ష, వొకేషనల్ (498/500) | ఎన్.శశికిరణ్, ఎంపీసీ (467/470)



యు.రణధీర్, ఎంపీసీ (466/470) | బి.భానుతేజ, ఎంపీసీ (465/470) | సిద్ధార్థ, బైపీసీ (434/440) | ఎం.జగన్, బైపీసీ (434/440)

మొయినాబాద్ మండల పరిధిలోని చిలుకూరు గురుకుల కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో 96 శాతం, సెకండియర్‌లో 90 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఫస్టియర్ ఎంపీసీలో 470 మార్కులకు గాను ఎస్.శశికిరణ్ 467, యు.రణధీర్ 466, బి.భానుతేజ 465 మార్కులు సాధించారు. బైపీసీలో 440 మార్కులకు గాను సిద్దార్థ, ఎం.జగన్ ఇద్దరు విద్యార్థులు 434 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. ఇంటర్ సెకండియర్ ఎంపీసీలో ఎం.దీన్‌దయాల్ 983, కె.మహేశ్ 981, కె.నవీన్ 980 మార్కులు సాధించి తమ సత్తాచాటారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు అభినందించారు.

శంకర్‌పల్లి గురుకులంలో..

శంకర్‌పల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల ఒకేషనల్‌లో బైపీసీ ఫస్టియర్‌లో 92 శాతం, సెకండియర్‌లో 83 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఒకేషనల్ ఫస్టియర్‌లో సీహెచ్ శ్రీవర్ష 498, సీహెచ్ కీర్తన 494, బి.అనూష, శిరీష 493 మార్కులు సాధించారు. బైపీసీ ఫస్టియర్‌లో 440 మార్కులకుగాను బి.అనూష 418, ఎస్.సిరివెన్నెల 417, ఎం.శిరీష 411 మార్కులు సాధించారు. బైపీసీ సెకండియర్‌లో సి.అర్చన 888, ఐ.అక్షయ 872, పి.నిరోష 871 మార్కులు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ జయమ్మ, అధ్యాపకులు అభినందించారు.

కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ



కృష్ణవేణి, ఎంపీసీ (439/470) | సంగీత, బైపీసీ (417/440) | పూజ, ఎంపీసీ (929/1000) | గాయత్రి, బైపీసీ (873/1000)

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కేజీబీవీలో మొదటి సంవత్సరంలో కృష్ణవేణి(ఎంపీసీ) 439 మార్కులు, సంగీత(బైపీసీ) 417 మార్కులను సాధించి జిల్లాస్థాయిలో టాపర్‌గా నిలిచారు. ద్వితీయ సంవత్సరంలో పూజ(ఎంపీసీ) 929 మార్కులు (జిల్లా టాపర్), గాయత్రి(బైపీసీ) 873 మార్కులను సాధించారు. ఫలితాలలో మెరుగైన ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ అరుణ అభినందించారు.

కార్మిక చట్టాలను కాపాడుకోవాలి

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పర్వతాలు



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న పర్వతాలు, నాయకులు

కొత్తూరు: పాలకుల కారణంగా కోల్పోయిన కార్మిక చట్టాలను మేడే స్ఫూర్తితో తిరిగి సాధించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు కార్మికులకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా పట్టణ సమీపంలోని నాట్కోఫార్మా ఆవరణలో ఆయన బుధవారం సీపీఐ మండల కార్యదర్శి షకీల్ ఆధ్వర్యంలో మే డే వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనేక పోరాటాలు, బలిదానాలతో ఆనాడు కార్మికులు సాధించుకున్న 8 గంటల పనిదినాలు, కనీస వేతనాలు, బోనస్, ఈఎస్ఐ, పీఎఫ్ చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రస్తుతం నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. కేవలం కార్పొరేట్ సంస్థలకు మాత్రమే మేలు చేసేలా చట్టాలను సవరిస్తూ కార్మికులకు అన్ని రకాలుగా అన్యాయం చేస్తున్నాయని వివరించారు. చట్టాల సవరణతో కార్మికులకు కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ అందడం లేదన్నారు. కార్మికుల శ్రమతో కోట్లు గడిస్తున్న యాజమాన్యాలు వారి సంక్షేమాన్ని మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వాల తీరుతో కార్మికులు పెరుగుతున్న నిత్యావసర ధరలతో రెండు పూటల కూడా సక్రమంగా తినలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. తమ హక్కుల సాధనకు కార్మికులు ఐక్యంగా ఉండాలని ఆయన కోరారు. అంతేకాకుండా మే డే వేడుకల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్య, వెంకటేశ్, ఎల్లయ్య, శ్రీను, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన బాలికలు



శ్రీవర్షిని, ఎంపీసీ (467/470)



సాయిప్రియారెడ్డికి స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

షాబాద్: మండల పరిధిలోని మల్లారెడ్డి గ్రామానికి చెందిన పరిగి శ్రీవర్షిని ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో 470 మార్కులకు గాను 467 మార్కులతో స్టేట్ రెండో ర్యాంక్ సాధించింది. ఆమెను తల్లిదండ్రులు ప్రభాకర్‌గౌడ్, జ్యోతిలు అభినందించారు. శ్రీచైతన్య హయత్‌నగర్‌లో చదువుతోంది. అదే విధంగా మండల పరిధిలోని గోపిగడ్డ గ్రామానికి చెందిన సాయిప్రియారెడ్డి 470 మార్కులకు గాను 452 మార్కులు సాధించింది. ఆమెకు తల్లిదండ్రులు కొలను జ్యోత్స్న, మహిపాల్‌రెడ్డి, నానమ్మ తాత లక్ష్మి, మల్లారెడ్డిలు స్వీటు తినిపించారు. శ్రీచైతన్య మియాపూర్‌లో చదువుతోంది.

మట్టి దందా..!

ఇష్టారాజ్యంగా జేసీబీలతో తవ్వకాలు

- చెరువులను తలపిస్తున్న భూములు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న యంత్రాంగం

కొత్తూరు: ముడుపుల మాయ.. అధికారుల అలసత్వం కారణంగా మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో టీఎస్ఐఐసీ సేకరించిన విలువైన పొలాల్లోని మట్టి వ్యాపారులకు కల్పతరువులుగా మారుతున్నాయి. రెండేళ్ల క్రితం చదునుగా ఉన్న పొలాలు ప్రస్తుతం భారీ యంత్రాలతో మట్టి, మొరం తవ్వకాలు చేపట్టడంతో చెరువులుగా దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం రైతుల నుంచి పొలాలు సేకరించిన తర్వాత వాటిపై పర్యవేక్షణ చేపట్టకపోవడంతో పలువురు మట్టి వ్యాపారులు యథేచ్ఛగా యంత్రాలతో మట్టి, మొరంను తవ్వి విక్రయిస్తున్నారు. గతేడాదిగా ఇక్కడ కోట్ల రూపాయాల విలువైన మట్టిని తవ్వి విక్రయించినట్లు సమీప గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధిపై ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అయినా సంబంధిత శాఖల అధికారులు పొలాల రక్షణకు చర్యలు చేపట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు.

గత ప్రభుత్వం సేకరించిన భూములు..

మండలంలోని సిద్ధాపూర్ శివారులో 252, 278, 361 సర్వే నంబర్లలోని 330.34 ఎకరాల్లో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములను గత ప్రభుత్వం అసైన్డ్ రైతుల నుంచి సేకరించి టీఎస్ఐఐసీకి బదలాయించారు. కాగా 330.34 ఎకరాల్లో 97.24 ఎకరాలు ప్రభుత్వ పొలం. మిగితాది 240 ఎకరాలు అసైన్డ్ పట్టాలు ఉన్న రైతులవి. దీనికి గాను అప్పటి ప్రభుత్వం లబ్ధిదారులుగా ఉన్న 245 మంది రైతులకు ఎకరానికి రూ.10లక్షల చొప్పున పరిహారం సైతం అందజేశారు.

జోరుగా దందా..

హైదరాబాద్‌కు అతి చేరువలో, అంతర్జాతీయ విమానాశ్రయానికి కూతవేటు దూరంలో ఉన్న కొత్తూరు మండలం అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఎప్పటికప్పుడూ కొత్త కొత్త పరిశ్రమలు, రియల్ వెంచర్లు, భారీ కట్టడాలు వెలుస్తున్నాయి. వీటి నిర్మాణానికి, చదును చేయడానికి వ్యాపారులకు భారీగా మొరం(మట్టి) అవసరం అవుతోంది. దీంతో వారు స్థానికంగా ఉన్న కొందరు మట్టివ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వారు సమాచారం బయటకు వెళ్లనీయకుండా కొందరికి ముడుపులు ఇస్తూ ప్రభుత్వ భూముల్లో నుంచి మట్టిని తవ్వేకుందుకు వ్యాపారులకు సహకరిస్తున్నారు. పెద్ద పెద్ద యంత్రాలతో వ్యాపారులు మట్టిని తవ్వడంతో పరిశ్రమలు, ఇతర ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు అనువైన పొలాలు చెరువులు, గుంతలను తలపిస్తున్నాయి.

కరువైన పర్యవేక్షణ..

గత ప్రభుత్వం సిద్ధాపూర్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఐటీ హబ్ ఏర్పాటు చేసే యోచనలో భూములను సేకరించింది. రైతుల నుంచి పొలాలను సేకరించిన తర్వాత టీఎస్ఐఐసీతో పాటు రెవెన్యూ అధికారులు ఆ పొలాలపై సరైన నిఘా పెట్టలేదు. నెలల తరబడి భారీ యంత్రాలతో పగలు, రాత్రి మట్టిని తవ్వుతున్నా అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా విలువైన భూములు పనికిరాకుండా పోతున్నాయి.



మట్టిని తవ్వడంతో చెరువులను తలపిస్తున్న టీఎస్ఐఐసీ పొలాలు



మామిడోని చెరువులో అక్రమ తవ్వకాలు(ఫైల్)

చర్యలు తీసుకుంటాం



సిద్ధాపూర్‌లో టీఎస్ఐఐసీకి కేటాయించిన పొలాల్లో గతంలో కొందరు మట్టి తవ్విన ఘటనలు ఉన్నాయి. దీంట్లో పలువురు వ్యక్తులపై కేసులు నమోదయ్యాయి. మారోమారు అక్కడ తవ్వకాలు చేపట్టినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల్లో నుంచి కూడా అనుమతులు లేకుండా మట్టి, మొరంను తవ్వొద్దు. ఏక్కడైనా అక్రమంగా తవ్వకాలు చేపడితే ప్రజలు మాకు సమాచారం ఇవ్వాలి.

– రవీందర్‌రెడ్డి, తహసీల్దార్, కొత్తూరు

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించండి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్యారాణి



చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సంధ్యారాణి

షాద్‌నగర్‌రూరల్: ఆరు సంవత్సరాలలోపు ఉన్న ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్యారాణి అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అన్నారం, కాశిరెడ్డిగూడ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటాపాటలతో కూడిన విద్యను నేర్పిస్తామన్నారు. చిన్నారులు మానసికంగా, శారీరకంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. చిన్నారులను అంగన్‌వాడీ పాఠశాలలో చేర్పించడంతో చిన్నప్పటి నుంచే వారిలో చదువుపై ఏకాగ్రత పెరుగుతుందన్నారు. అనంతరం చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు హేమలత, రజిత, ఆయా అన్నపూర్ణ, చిన్నారుల తల్లితండ్రులు పాల్గొన్నారు.